



ఆధ్యాత్మిక పండుగ..

భక్తజన సంద్రంగా వాడపల్లి క్షేత్రం



కేరళ వాయిద్య బృందాల సందడి



సింహవాహన సేవ



ప్రత్యేకాలంకరణలో వెంకన్న

వెంకన్న వేషధారణ



వాడపల్లి వెంకన్న క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజు తిరుప్పావడ సేవ నిర్వహించారు..

వార్త..6లో

నకిలీ రేషన్ కార్డులు 4430

- ఉమ్మడి జిల్లాలో నకిలీలపై సర్వే
- రెండు రాష్ట్రాల్లో కార్డులపై ఆరా
- ఒక రాష్ట్రంలో తొలగింపు
- కేంద్ర గణాంకాలతో పరిశీలన

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):తెల్లరేషన్‌కార్డుల్లో నకిలీలను ఏరివేయనున్నారు.ఏపీతో పాటు వేరే రాష్ట్రంలోను రేషన్‌కార్డు పొంది అక్కడా.. ఇక్కడా కూడా లబ్ధిపొందుతున్న కొందరిపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్దఎత్తున డూప్లికేట్ రేషన్ కార్డులు ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్రం గణాంకాల ఆధారంగా సర్వే చేయనున్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4430 డూప్లికేట్ తెలుపు రేషన్ కార్డులు ఉన్నట్టు నేషనల్ లెవెల్ డీ డూప్లికేట్ ఆఫ్ రేషన్‌కార్డు డేటా బేస్ ఆధారంగా గుర్తించారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిస్సా రేషన్ కార్డుల్లో సభ్యులుగా ఉన్నట్టు గుర్తించారు. వన్ నేషన్-వన్ రేషన్ కార్డు పేరిట నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా ఇది బయట పడింది.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు.డేటాను అనుసరించి రీసర్వే చేసి రెండు రాష్ట్రాల్లో కార్డులున్న వారి వివరాలను పంపాలని సూచించారు. దీనిపైఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో వీఆర్వోలు సర్వే చేయను న్నారు.

డూప్లికేట్లతో పక్కదారి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కాకినాడ జిల్లాలో 319, కోనసీమ 324, తూర్పుగోదావరి జిల్లాలో 269, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3518 డూప్లికేట్ రేషన్ కార్డులు ఉన్నట్టు కేంద్రం పంపిన నివేదికలో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రీసర్వే చేసి ఆయా రేషన్‌కార్డుల్లో సభ్యులు ఇతర రాష్ట్రాల్లో ఉన్న రేషన్‌కార్డుల సభ్యులు ఒక్కరేనని ధ్రువీకరించిన తర్వాత రేషన్‌కార్డుల నుంచి కుటుంబ సభ్యులను తొలగిస్తారు. పేదలకు అందాల్సిన ఉచిత బియ్యం పథకం పక్కదారిన పడుతుందని పెద్ద ఎత్తున కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. ఒకే వ్యక్తిగానీ, ఒకే కుటుంబంగానీ రెండు రాష్ట్రాల్లో రేషన్ తీసుకోవడంవల్ల ప్రభుత్వానికి పెద్దఎత్తున నష్టం జరుగుతుందని గుర్తించింది.ఈ విషయమై జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి ఎంపీ ప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

15 శాతం వృద్ధిరేటే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక

అమలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 15 శాతం వృద్ధిరేటే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ కలెక్టర్లకు సూచించారు. విద్య, వైద్యం, సామాజిక సూచికలు, ప్రాథమిక, సెకండరీ సెక్టార్లలో వృద్ధి రేటులో మండల జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ నెల 29న విజన్ ప్లాన్ ఎక్సర్‌సైజు సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించనున్నారని, అప్పటికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీపీవో శాంతలక్ష్మి, డీఎస్‌వో ఉదయభాస్కర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కార్తీక్ పాల్గొన్నారు.

డీఈవోగా సలీంబాషా



ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారిగా షేక్ సలీంబాషా నియమితులయ్యారు. ఇంతకు ముందు ఇక్కడ డీఈవోగా పనిచేసిన ఎం.కమలకుమారి పశ్చిమగోదావరి జిల్లా దూబచర్ల డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్వపు శాఖకు బదిలీపై వెళ్లారు. గుంటూరు జిల్లా బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న షేక్ సలీంబాషా డీఈవోగా నియమితులయ్యారు. అయితే ఆయన బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

డీఆర్వోగా సరళావందనం

అమలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్వోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్తెనపల్లి సరళావందనం నియమితులయ్యారు. ప్రస్తుతం డీఆర్వోగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లు పశ్చిమగోదావరి జిల్లా డీఆర్వోగా బదిలీ అయ్యారు.

ఓఎన్జీసీ సైట్‌లో భారీ శబ్దాలు

అర్ధరాత్రి వేళ భయాందోళన

- బ్లోఅవుట్ భయంతో జనం పరుగులు
- గ్యాస్ లీకేజీతోనే శబ్దం అంటున్న అధికారులు
- వైట్ ఆయిల్ దొంగల తప్పిదంతో
- తెరుచుకున్న గ్యాస్ వాల్వ్
- లీకేజీని నియంత్రించిన ఓఎన్జీసీ సిబ్బంది



చల్లపల్లి జీఎండీఏ-14 బావి

ఉప్పలగుప్తం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి ఓఎన్జీసీ సైట్‌లో జీఎండీఏ-14 బావి నుంచి బుధవారం అర్ధరాత్రి బ్లోఅవుట్‌ను తలపించేలా భారీ శబ్దాలు వెలువడ్డాయి. అర్ధరాత్రి ఏమి జరుగుతుందో తెలియని అయోమయ స్థితిలో బెస్తవారిపేట, గోపవరం మెయిన్, కోట మాయమ్మకాలనీ, జగ్గరాజుపేట, అయితాబత్తులవారిపేట పరిసర ప్రాంతాల జనం భయాందోళనకు గురయ్యారు. బ్లోఅవుట్ భయంతో పరుగులు తీశారు. విషయాన్ని కొందరు ఓఎన్జీసీ అధికారులకు తెలియజేశారు. గురువారం వేకువజామున అధికారులు వచ్చి గ్యాస్ లీకేజీని నియంత్రించారు. అత్యధిక ఒత్తిడితో గ్యాస్ బయటకు రావడంతో పెద్దపెద్ద శబ్దాలు వెలువడినట్టు ఓఎన్జీసీ అధికారులు విశ్లేషించారు. అయితే గ్యాస్ లీక్‌కు అసలు కారణం మాత్రం వైట్ ఆయిల్ చోరులే అని అక్కడి ఆనవాళ్లను బట్టి గుర్తించారు. వైట్ ఆయిల్ చోరీకి వచ్చినవారు ఆయిల్ పైప్ వాల్వ్‌కు బదులు గ్యాస్ పైప్ మీటర్ వాల్వ్‌ను తెరవడంతో ప్రమాదం జరిగినట్టు తెలిసింది. ఒకే సారి ఎక్కువ పీడనంతో గ్యాస్ వెలువడటంతో భయంకర శబ్దాలు వెలువడ్డాయి. దొంగలు తమ వాహనాన్ని దూరంగా ఉంచి, కేవలం టిన్నులనే సైట్‌లోకి తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పిందని అంచనా వేస్తున్నారు. వాహనాన్ని బావి వద్దకు తీసుకొస్తే నిప్పంటుకుని తీవ్రస్థాయిలో మంటల చెలరేగి భారీ అగ్నిప్రమాదం జరిగేదని అంటున్నారు. జరిగిన సంఘటనలో ఓఎన్జీసీ అధికారుల నిర్లక్ష్యం ఉందని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ ఐ.ఎం రామచంద్రుడు, రైతుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ మొత్తం ఉదంతంపై రైతులు రమేష్‌రాజు, జగన్‌రాజు, ఇసుకపట్ల రఘుబాబు, గొలకోటి చిన్నా, ధారపురెడ్డి శ్రీధర్ తదితరులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చల్లపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఓఎన్జీసీ సైట్‌ల వల్ల తాము గతంలో ఆయిల్, గ్యాస్ లీకేజీల వల్ల ఎంతో నష్టపోయామని విన్నవించారు. సైట్‌ల వద్ద ఎటువంటి భద్రత లేక వైట్ ఆయిల్ చోరీలు జరుగుతున్నాయన్నారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. జీఎండీఏ-14 సైట్ వద్ద పరిసర ప్రాంతాల కుటుంబాలకు ఎటువంటి హాని జరగకుండా తగిన భద్రత కల్పించాలని కోరారు. నివాసాల చెంతన చమురు, గ్యాస్ ఉత్పత్తులకు తాము సహకరిస్తున్నా, ఓఎన్జీసీలో కొందరు అధికారులు మాత్రం తమ పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని అందోళన వ్యక్తం చేశారు. గతంలో తమకు జరిగిన నష్టాలకు అరకొరగా సాయం అందించి చేతులు దులుపుకున్న ఓఎన్జీసీతో భవిష్యత్‌లో తాము పోరాటాలు చేసే పరిస్థితి రాకుండా చూడాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.



రైల్వేలైన్ అభ్యంతరాలను సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-216, కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పెండింగ్ కేసులు, అభ్యంతరాలను సత్వరం పరిష్కరించి పనుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం భూసేకరణ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కోర్టు కేసులు, నిర్వాసితులు కోల్పోతున్న భూములు, కట్టడాలపై వచ్చిన అభ్యంతరాల పరిస్థితుల స్థితిగతులపై కలెక్టర్ ఆరా తీశారు. గడువులోగా సమస్యలు పరిష్కరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కోనసీమ ప్రాంత అభివృద్ధికి ప్రధానమైన జాతీయ రహదారి, రైల్వేలైన్ ఏర్పాటుకు స్థానిక ప్రజానీకం కూడా తమ వంతు సహకారం అందించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. నిర్వాసితుల అభ్యంతరాలను సామరస్యపూర్వక వాతావరణంలో శాంతియుతంగా పరిష్కరించాలని సూచించారు. రైల్వేలైన్ భూసేకరణ ప్రక్రియ కోసం రెవెన్యూ, రైల్వే, సర్వే తదితర శాఖలతో నియమించిన బృందాలు సేకరించిన వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలో నింపి సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన

- గణనకు 285 మంది ఎన్యూమరేటర్ల నియామకం
- కలెక్టర్ మహేష్‌కుమార్

21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 426 రెవెన్యూ గ్రామాల్లో పశుగణన కోసం 285 మంది ఎన్యూమరేటర్లను నియమించామన్నారు. ఇప్పటికే వారికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ప్రతీ ఇంటికీ తిరిగి వివరాలను సేకరిస్తారన్నారు. ఏ ఒక్క పశువును వదలకుండా లెక్కించాలని ఆదేశించారు. సిబ్బంది సేకరించిన డేటా ఆధారంగానే నూతన పథకాలకు పశుసంవర్ధక శాఖ రూపకల్పన చేస్తుందన్నారు. ప్రతీ గ్రామంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లతో పాటు వీధి కుక్కలు, ఆబోతులను కూడా పశుగణనలో లెక్కిస్తారన్నారు. 2019లో జరిగిన పశుగణన ప్రకారం జిల్లాలో 75,460 ఆవులు, 1,53,542 గేదెలు, 25,111 గొర్రెలు, 23,518 మేకలు, 6268 పందులు, 57లక్షల కోళ్లు ఉన్నాయని వివరించారు. వ్యాపారం నిమిత్తం పశువులను వివిధ ప్రాంతాలకు తరలించడం వల్ల గణాంకాలు మారే పరిస్థితులు ఉన్నందున ఐదేళ్లకోసారి పశుగణన చేపట్టినట్టు కలెక్టర్ తెలిపారు.

పాలగుమ్మిలో స్త్రీనిధి సొమ్ములు స్వాహా

- ముందస్తు ఆడిట్‌లో రూ.9 లక్షలు మాయం
- విచారణ పూర్తికాలేదు: ఏజీఎం

అమలాపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మిలో డ్వాక్రా మహిళలు చెల్లించిన రూ.15లక్షలు మేర స్త్రీనిధి సొమ్ములను ఇద్దరు వీవోఏ (యానిమేటర్లు) స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో పేమెంట్ల రికవరీ సక్రమంగా జరగకపోవడంతో స్త్రీనిధి అధికారులు మేల్కొన్నారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గ్రామంలో లావణ్య, కనక మహాలక్ష్మి యానిమేటర్లుగా పనిచేస్తున్నారు. గత కొంత కాలంగా తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిస్తున్నా బ్యాంకుకు చెల్లించకపోవడంతో డ్వాక్రా మహిళలు నిండా మునిగిపోయారు. జరిగిన వ్యవహారంపై ఇటీవల స్త్రీనిధి బ్యాంకు మేనేజర్ అనీష్ విచారణ జరపగా అప్పటికే రూ.9 లక్షల మేర అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. స్వాహా చేసిన సొమ్ములు తిరిగి చెల్లిస్తామని గ్రామస్తుల సమక్షంలో యానిమేటర్లు చెప్పారు. దాంట్లో సుమారు రూ.4లక్షల మేర తిరిగి జమ చేసినట్టు ఏజీఎం ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఇంకా విచారణ పూర్తి కాలేదని డ్వాక్రా సంఘాల వారీగా, సభ్యుల వారీగా స్త్రీనిధికి జమ చేసిన మొత్తాలపై విచారించాల్సి ఉందని ఆమె తెలిపారు. అయితే గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు రూ.15లక్షల మేర స్త్రీనిధి సొమ్ములను యానిమేటర్లు స్వాహా చేశారని విచారణ జరిపితే అది మరింత పెరిగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

8157 ఫిర్యాదులకు 8077 పరిష్కారం

- సీజీఆర్ఎఫ్ సేవల వినియోగానికి అవగాహన సదస్సులు
- విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారాలు
- చైర్మన్ సత్యనారాయణ



ఫిర్యాదు స్వీకరిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

అమలాపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సీజీఆర్ఎఫ్ కృషి చేస్తుందని విశ్రాంత న్యాయమూర్తి, చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ చెప్పారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు భారత విద్యుత్ చట్టాన్ని అనుసరించి ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు సీజీఆర్ఎఫ్‌కు 8157 ఫిర్యాదులు అందగా 8077 పరిష్కరించామని, 80 పెండింగ్ దశలో ఉన్నట్టు తెలిపారు. ఈదరపల్లిలోని విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) అవగాహన సదస్సుతో పాటు వినియోగదారులు ఎదుర్కొనే సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. చైర్‌పర్సన్ సత్యనారాయణతో పాటు ప్రత్యేక న్యాయస్థానం సభ్యులు షేక్ బాబర్, ఎస్.మసిల్మిణి, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 395 ఫిర్యాదులను స్వీకరించగా 315 పరిష్కరించామన్నారు. గత ఏడాది అందిన 536 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. అంతేకాకుండా 107 కేసుల్లో వినియోగదారులకు రూ.14.26 లక్షలు నష్ట పరిహారం చెల్లించేలా విద్యుత్‌శాఖకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. సీజీఆర్ఎఫ్‌పై అందరికీ అవగాహన కల్పించేలా 90 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. అంతేకాకుండా 276 క్యాంపు కోర్టులు నిర్వహించినట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నంబరు 1912కు తెలియచేయాలన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే సీజీఆర్ఎఫ్ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రధానమైన కేసుల్లో 60 రోజుల్లోనే తీర్పు ఇస్తున్నామని, వినియోగదారులు కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం కూడా ఉండదని చెప్పారు. సీజీఆర్ఎఫ్‌లో సమస్య పరిష్కారం కాని పక్షంలో విజయవాడలోని విద్యుత్ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదుచేసి న్యాయం పొందవచ్చునని వివరించారు. విద్యుత్ బిల్లుల్లో లోపాలు, తీగల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, మీటర్లు కాలిపోవడం, ఓల్టేజీ సమస్యలు, మీటర్ల లోపాలు, కొత్త విద్యుత్ సర్వీసులు అందించే సమయంలో జాప్యం, అదనపు లోడు మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదు చేయవచ్చునని అవగాహన సదస్సులో ఆయన వివరించారు. వినియోగదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు, నోడల్ అధికారి ఎం.రవికుమార్‌తో పాటు విద్యుత్‌శాఖ ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలుదారులకు, రైతులకు పంటల బీమా లబ్ధి అందించాలి

అమలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కౌలుదారులు, రైతులకు పంట బీమా లబ్ధిని అందించేందుకు అన్నివిధాలా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖల ప్రత్యేక కమిషనర్ బి.రాజశేఖర్ సూచించారు. గురువారం అమరావతి నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కౌలుదారులు, రైతులకు పంట రుణాలు అందించడం, ఇన్సూరెన్సు చేయించడం తదితర అంశాలపై జిల్లా అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కౌలు రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి పంట రుణాలు పొందని సాగు హక్కు పత్రం పొందిన కౌలు రైతులకు ఎటువంటి హామీ లేకుండా రూ.1.60లక్షల రుణాన్ని మంజూరు చేయాలని కోరారు. సాంకేతికపరంగా తక్కువ పెట్టుబడితో వ్యవసాయ సాగును చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుందన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. బీమా వర్తింపు కోసం కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలన్నారు. గ్రామ, మండల యూనిట్‌గా బీమా పరిహారాలను చెల్లించనున్నట్లు చెప్పారు. వివిధ అంశాలపై అధికారులతో ఆమె చర్చించారు. జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా ఉద్యానవన అధికారి బీవీ రమణ, సీపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

2న మందకృష్ణ మాదిగ పర్యటన

అమలాపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ రాష్ట్ర పర్యటనలో భాగంగా నవంబరు 2న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో పర్యటించనున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నవరపు భైరవమూర్తి చెప్పారు. ఇమ్మిడివరప్పాడులో గురువారం అత్యవసర సమావేశం భైరవమూర్తి అధ్యక్షతన జరిగింది. జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్ మాదిగ, ఎమ్మెస్పీ నాయకులు ఆకుమర్తి భాస్కర్, మంద రామకృష్ణ, ఖండవల్లి ఏలియ, చాట్ల దుర్గారావు, ఉందుర్తి కిశోర్, కన్నెపాముల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మధుమేహం ఉన్నా.. 'మధురంగా'

మార్కెట్‌లో ఆకర్షిస్తున్న డయాబెటిక్ స్వీట్స్

తీపి తిన్నామనే ఫీల్ పొందొచ్చు

అందులో పంచదార కంటే.. తక్కువ చక్కెరనిచ్చే పదార్థాలు

ఇవి ఆలస్యంగా అరగడం వల్ల తక్కువ షుగర్ లెవెల్స్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తీపి అంటే ఎవరికి చేదు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనాసరే స్వీట్ అంటే ఇష్టమే. ముఖ్యంగా గోదావరి జిల్లాల ప్రజల జీవన శైలిలో తీపి ఓ భాగం. శుభకార్యక్రమం గురించి చెప్పేటప్పుడు, అభినందించేటప్పుడ నోటిని తీపి దనం చేస్తారు. బంధువులు, మిత్రుల ఇళ్లకు వెళ్లేటప్పుడు కూడా చాలామంది స్వీట్స్ తీసుకుని వెళ్తారు. ఫంక్షన్ల భోజనాల్లో స్వీట్లు లేకుండా వడ్డన ఉండదు. పండుగలకు స్వీట్ తప్పనిసరిగా ఉంటుంది. చివరకు పరామర్శలకు వెళ్లేటప్పుడూ పంచదారో, స్వీటో వంటి తీపి పదార్థాలను తీసుకువెళ్తారు. అంటే షడ్రుచుల్లో తీపి ఒకటి. ప్రధానమైనది కూడా. కానీ మధుమేహ (చక్కెర.. డయాబెటీస్) వ్యాధితో బాధపడుతున్న వారికి స్వీట్ ఓ ప్రమాదకర పదార్థమైపోయింది. స్వీట్ తినడంవల్ల షుగర్ లెవల్స్ పెరిగి ప్రాణాంతక పరిస్థితులు కూడా ఏర్పడతాయి. వైద్యులు కూడా స్వీట్లు తినవద్దని హెచ్చరిస్తారు. పంచదార ఉండే ఏ పదార్థాలు, దుంపలు వంటి కూరలు కూడా కట్టడి చేస్తారు. కానీ రుచికి అలవాటు పడిన నాలుకను ఆపడం కష్టమే. స్వీట్ తినే అదృష్టం కూడా లేదని గతంలో వారంతా తెగ బాధపడిపోయేవారు. ఒక్కొక్కరు ఉండలేక ఓ స్వీట్ తినేయడం.. టాబ్లెట్ వేసుకోవడం కూడా చేస్తున్నారు. కానీ కొంతకాలంగా డయాబెటీస్ బాధితుల నోటిని తీపిచేస్తూ వారికి షుగర్ లెవల్స్ పెరగకుండా చేస్తూ ఉండే స్వీట్లు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. దీంతో చాలా మంది మనస్సు కుదుటపడింది. మార్కెట్‌లో డయాబెటీస్ స్వీట్లు పేరిట షుగర్‌ఫ్రీ స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు కూడా మార్కెట్‌లో ఉన్నాయి. స్వీట్లలో డయాబెటిక్ కాజా, సున్నుండలు, కోవా, కాజూబర్ఫీ, మోతీచూర్ లడ్డూ వంటివి అందుబాటులో ఉన్నాయి. కానీ ఇవి పూర్తిగా స్వీట్‌లెస్ స్వీట్లు కావు. ఈ పదార్థాల్లో పంచదారశాతం తక్కువ. ఆలస్యంగా అరుగుతాయి. అందువల్ల తిన్న వెంటనే ప్రభావం చూపవు. ఆలస్యంగా కొద్ది ప్రభావం మాత్రమే చూపుతాయి.

ఇవి ఎలా తయారు చేస్తారంటే..

ఈ స్వీట్లలో పంచదార వినియోగించరు. మార్కెట్‌లో లభ్యమయ్యే టాటాఫోసెన్స్, స్వీట్ మేకర్, హాఫ్ షుగర్ వంటి మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే పదార్థాలతో తయారుచేస్తారు. ఇది కొంత వరకూ డయాబెటిక్ బాధితుల నోటిని తీపి చేసుకోవచ్చు. టాటాఫోసెన్స్ లిక్విడ్ రూపంలో ఉంటుంది. దీంతో గులాబ్‌జామ్, కాజాలు వంటివి తయారు చేస్తారు. పంచదారలో 100శాతం పంచదార ఉంటే, బియ్యంలో 70శాతం వరకే ఉంటుంది. టాటాఫోసెన్స్‌లో 18శాతం మాత్రమే ఉంటుంది. అందువల్లే దీంతో తయారు చేసే స్వీట్లకు మార్కెట్ పెరిగింది.

ప్రత్యామ్నాయం.. డైట్ షుగర్

మార్కెట్‌లో పంచదారకు ప్రత్యామ్నాయంగా డైట్ షుగర్ వచ్చింది. ఇది పంచదారలాగే ఉంటుంది. గరుకుతనం కాస్త తక్కువ. స్వీట్‌నెస్ ఎక్కువ. దీంతో కోవా, క్యాజూబర్ఫీ వంటివి తయారు చేసుకోవచ్చు. కాఫీ, టీలలో వాడొచ్చు. మార్కెట్‌లో రెలిష్, నేచురా, గ్రీన్స్, షుగర్ లైట్ వంటి పేర్లతో వీటిని విక్రయిస్తున్నారు.

ఆఫ్ షుగర్

ఇది కూడా పంచదారలాగే ఉంటుంది. పంచదారలో ఉండే కాలరీస్‌లో సగమే ఉంటాయి. పంచదారలాగే తియ్యగా ఉంటుంది.

జలాటో

జలాటో అనేది ఐస్‌క్రీమ్‌లా ఉంటుంది. దీన్ని ఇటాలియం డిజట్ అంటారు. కానీ ఇది ఐస్‌క్రీమ్‌లా గట్టిపడదు. స్పూన్‌తోనే తినవచ్చు.

● నెమ్మదిగా అరుగుతాయి..



వాస్తవానికి డయాబెటీస్ స్వీట్ల కంటే మామూలు స్వీట్లే తీయగా ఉంటాయి. డయాబెటిక్ స్వీట్లలో చక్కెర శాతం తక్కువ ఉంటుంది. అసలు ఉండకుండా లేదు. కానీ డయాబెటీస్ స్వీట్లు నెమ్మదిగా అరుగుతాయి. పంచదారలా వెంటనే శరీరంలో కలిసిపోవు. అందువల్లే మధుమేహ బాధితులు వీటిని తిన్నా, పెద్దగా షుగర్‌లెవ్స్ పెరగవు.

-పోలిశెట్టి మల్లిబాబు, సురుచి అధినేత

కత్తి కట్టి.. ఆరేళ్లు!



నేటికీ తేలని కోడి కత్తి కేసు.. కేసు తేలకుండానే శ్రీనివాసరావుకు ఐదేళ్లు జైలు శిక్ష

కోడి కత్తి కేసు సంఘటన జరిగి గురువారం నాటికి ఆరేళ్లు పూర్తయ్యింది. అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌పై విశాఖ విమానాశ్రమంలో కోడికత్తితో శ్రీను దాడిచేశాడన్నది అభియోగం. ఈ కేసులో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి కోర్టుకు హాజరై తన వాదన చెప్పక పోవడంతో ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. జగన్ తరఫు న్యాయవాదులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంతో కేసు కోర్టులో వాయిదా పడుతూనే వస్తోంది. ప్రస్తుతం జగన్మోహనరెడ్డి సాధారణ ఎమ్మెల్యే అయినా కోర్టులో విచారణకు హాజరు కాకపోవడానికి ఏమిటి ఇబ్బందని నిందితుడు తరుపు న్యాయవాది సలీం, కుటుంబసభ్యులు, దళిత సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. మంత్రిగా ఉన్న నారా లోకేశ్ పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరవుతున్నారు కదా? ఆయనకు లేని ఇబ్బంది జగన్‌కే ఏంటని వారు పేర్కొంటున్నారు.

ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆ రోజు 2018, అక్టోబరు 25వతేదీ. విశాఖపట్నం విమానాశ్రయంలో నాటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహనరెడ్డిపై కోడికత్తి దాడి జరిగింది. జగన్ వీరాభిమాని అయిన ముమ్మిడివరం మండలం ఠానేలంక పెదపేటకు చెందిన జనిపల్లి శ్రీనివాసరావు విశాఖపట్నం విమానాశ్రయంలో చెఫ్‌గా పనిచేసేవాడు. ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్న జగన్ హైదరాబాద్ కోర్టుకు వెళ్లేందుకు విశాఖ విమానాశ్రయంలో వీఐపీ లాంజ్‌లో కూర్చున్న సమయంలో శ్రీనివాసరావు మీ అభిమానిని అం టూ ఆయన దగ్గరకు వెళ్లి మాటలు కలిపి కోడి కత్తితో దాడి చేయగా జగన్ వ్యక్తిగత భద్రత సిబ్బంది, సీఐఎస్ఎఫ్ అధికారులు అప్రమత్తమై శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడి సమయంలో జగన్‌కు ఎడమ భుజంపై చిన్న గాయమైంది. దీనిపై జగన్ అప్పుడు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చెయ్యలేదు. అక్కడ ప్రథమ చికిత్స చేయించుకుని హైదరా బాదులో మెరుగైన వైద్యం చేయించుకుంటానని వెళ్లిపోయారు. ఆ తర్వాత శ్రీనివాసరావు నా గొంతు కొయ్యబోయాడని జగన్ ఆరోపించగా జగన్‌పై హత్యాయత్నం చేసిందని శ్రీనివాసరావు అని చేయించింది క్యాంటీన్ ఓనర్ హర్షవర్థన్ అని, హర్షవర్థన్ టీడీపీ నాయకుడేనంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం, ధర్నాలు చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదుచేశారు. విశాఖపట్నం సిట్ (ప్రత్యేక దర్యాప్తు సంస్థ) దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాత ఎన్ఐఏ(జాతీయ దర్యాప్తు సంస్థ) కూడా మరో కేసు నమోదు చేసింది. కేసు విచారణ తర్వాత 2019, మే 25న శ్రీనివాసరావుకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2019, ఆగస్టు 13న ఎన్ఐఏ అధికారులు విచారణ కోసం శ్రీనివాసరావు బెయిల్ రద్దు చేశారు. న్యాయం చేయాలని శ్రీనివాసరావు కుటుంబసభ్యులు అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ ఎన్‌వీ రమణకు ఒక లేఖ రాశారు. వాస్తవ పరిస్థితులు తెలపడానికి వీరు జగన్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. 2022, సెప్టెంబరు 26న శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు జగన్‌ను కలవడానికి అనుమతి ఇచ్చి తరువాత నిరాకరించారు. ఈ క్రమంలో 2023 నవంబరు 28న ఎన్ఐఏ కోడి కత్తి దాడిలో కుట్రకోణం లేదని హైకోర్టుకు నివేదించింది. శ్రీనివాసరావు తప్ప ఇతర వ్యక్తుల పాత్రకానీ, రాజకీయ పార్టీల ప్రమేయంకానీ లేదని ఎన్ఐఏ తేల్చి చెప్పింది. 2023, ఆగస్టు 1న ఈ కేసు విజయవాడనుంచి విశాఖ ఎన్ఐఏ కోర్టుకు బదిలీ అయ్యింది. జను పల్లి శ్రీనివాసరావు తల్లి సావిత్రి, సోదరుడు సుబ్బరాజు శ్రీనివాసరావు బెయిల్‌కు జగన్ కోర్టుకు హాజరై తన సాక్ష్యం చెప్పాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో వారు నిరహారదీక్ష చేపట్టగా శ్రీనివాసరావు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో నిరహారదీక్ష చేపట్టారు. వారి దీక్షను పోలీసులు భగ్నం చేసి బలవంతంగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై దళిత సంఘాలు ఆందోళన చేపట్టారు. శ్రీనివాసరావు విషయంలో జైలు అధికారులు తీరు అనుమానాస్పదంగా ఉందని విశాఖ దళిత సంఘం ఐక్యవేదిక ఆందోళన వ్యక్తం చేసింది. దళిత సంఘాలు, మైనార్టీ హక్కుల సంక్షేమ సంఘం, సమత సైనికదళ్, న్యాయవాది సలీం పోరాట ఫలితంగా 2024 ఫిబ్రవరి 9న శ్రీనివాసరావుకు కోర్టు కండిషన్ బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టి వెళ్లాలనే నిబంధన విధించారు. ఐదేళ్ల 14రోజులు శ్రీనివాసరావు కోర్టు శిక్ష విధించకుండానే జైలు జీవితం అనుభవించాడు. కేసు మాత్రం నేటికీ తేలలేదు.

జైల్లో ఉన్నత చదువులు

ఇక శ్రీనివాసరావు జైల్లో ఉండగా బీఏ డిగ్రీ, ఎంఏ సోషాయాలజీ పూర్తిచేశాడు. తనకు జరిగిన అన్యాయంపై సమాజంలో మంచి కోసం పోరాటం చేసేందుకు తాను సోషియాలజీ చదివినట్టు శ్రీనివాసరావు పేర్కొంటున్నాడు. వారం రోజుల్లో శ్రీనివాసరావు అతడి కుటుంబసభ్యులు ముఖ్యమంత్రిని కలిసి పరిస్థితిని వివరించేందుకు సమాయత్తం అవుతున్నట్టు సమాచారం. ఐదేళ్లుగా ఆర్థికంగా, సామాజికంగా తాము పడుతున్న ఇబ్బందిని వివరించనున్నారు. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయడం ఎంతో ఇబ్బందిగా ఉందని, తనకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని సామాజిక న్యాయంపై శ్రీనివాసరావు ఒక పుస్తకం రాస్తున్నట్టు తెలిసింది.



స్వగ్రామం ఠానేలంక పెదపేటలో కుటుంబ సభ్యులు న్యాయవాదితో శ్రీనివాసరావు (ఫైల్‌ఫొటో)





వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న వేద పండితులు. పక్క చిత్రంలో తిరుప్పావడ సేవ జరుపుతున్న దృశ్యం



సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

వైభవంగా తిరుప్పావడ సేవ

వాడపల్లిలో నాల్గో రోజు ఘనంగా బ్రహ్మోత్సవాలు

యోగ నారసింహ అలంకరణలో శ్రీవారి సింహ వాహనసేవ

ఆకట్టుకున్న పలు సాంస్కృతిక ప్రదర్శనలు

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాల్గవ రోజు గురువారం కూడా ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించిన వసంత మండపంలో కొలువుతీరి పూజలు అందుకున్నారు. ఖండవల్లి రాజేశ్వర ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు క్రతువు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనము, అష్టకలశారాధన, ప్రధాన హోమాలు, దిగ్దేవ బలి హరణ తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపారు. స్వామివారి అంతరాలయంలో తిరుప్పావడ సేవా కాలం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా జరిపారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, బలిహరణ తదితర కార్యక్రమాలు వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. స్వామివారి క్షేత్రం ఫలపుష్ప విద్యుత్ కాంతులతో చూపరులను ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కనకదుర్గాదేవి దంపతుల చేతుల మీదుగా బ్రహ్మోత్సవ పూజలు జరిపారు. అనంతరం యోగ నార సింహ అలంకరణలో శ్రీవారు సింహ వాహనంలో కొలువదీరారు. బాణసంచా కాల్పులు, భక్తుల గోవింద నామస్మరణ, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య తిరుమాడవీధుల్లో సింహ వాహనసేవ జరిపారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న ఉపకమిషనరు చక్రధరరావు దంపతులు

వాడపల్లిలో నేడు..

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం గోదావరి నదీ జలా సంగ్రహణము, మహాలక్ష్మి హోమము, మలయప్ప అలంకరణతో స్వామివారి గరుడ వాహనసేవ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వీసీల నియామకంలో.. ఎందుకీ ఆలస్యం?



● ఇన్‌ఛార్జి వీసీల పాలనలోనే విశ్వవిద్యాలయాలు

● వర్సిటీలకు వీసీల నియామక సన్నాహాల్లో కూటమి ప్రభుత్వం

● నేటిలోగా సెర్చ్ కమిటీ సభ్యుడి పేరు ప్రతిపాదించాలి

జేఎన్టీయూకే, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వీసీల నియామకంలో జాప్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖలో మార్పులు, సంస్కరణలు దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు రాజీనామా చేయాలని అనధికారికంగా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాష్ట్రంలోని 17 వర్సిటీల వీసీలు రాజీనామా చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జేఎన్టీయూకే వీసీ, రాజానగరంలోని అక్నా వీసీలు కూడా రాజీనామా చేశారు. ప్రస్తుతం జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీగా ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, నన్నయ విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీగా ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, జేఎన్టీయూకే మరో ప్రొఫెసర్ కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీగా కొనసాగుతున్నారు.

వీసీ పదవికి 20 దరఖాస్తు

రెగ్యులర్ ఉపకులపతుల నియామకం కోసం జేఎన్టీయూకే నుంచి 20మందికిపైగా రాష్ట్ర ఉన్నత విద్యామండలికి దరఖాస్తు చేసినట్లు సమాచారం. దరఖాస్తు చేసిన వారందరూ వీసీ పదవి కోసం రాజకీయంగా, సామాజికవర్గపరంగా పలుకుబడి ఉన్నవారితో పైరవీలు చేస్తున్నారు. మంత్రి నారాలోకేశ్‌తో సన్నిహిత సంబంధాలున్న జిల్లాకు చెందిన రాజకీయ నాయకుల ద్వారా తమ బయోడేటాలను ఆయనకు పంపిస్తున్నారు.

సెర్చ్‌కమిటీలో ముగ్గురు సభ్యులు

విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును శుక్రవారం లోపు ప్రతిపాదించాలని ఏపీఎస్సీహెచ్ఈ నుంచి వర్సిటీలకు ఆదేశాలు వచ్చాయి. విశ్వవిద్యాలయాల పాలకమండలి సమావేశంలో సభ్యుడి పేరును తీర్మానించాలి. ఈసీ సూచించే సెర్చ్ కమిటీ సభ్యుడు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు కాకుండా ఉండాలి. ఇతర వర్సిటీల ఆచార్యులను పాలక మండలి సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమించాలి. ఉపకులపతుల ఎంపికకు సెర్చ్‌కమిటీ సూచనలు చేస్తుంది. దీనిలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీనుంచి ఒకరు, ప్రభుత్వం నుంచి ఒకరు, వర్సిటీ నుంచి మరొకరిని పాలక మండలి ప్రతిపాదిస్తుంది. వీసీ పదవి కోసం ప్రొఫెసర్లు చేసిన దరఖాస్తులను సెర్చ్ కమిటీ పరిశీలిస్తుంది. వారి అనుభవం, పరిశోధనలు వంటి అంశాలను పరిశీలించి రాష్ట్ర ఉన్నత విద్యామండలికి సూచనలిస్తారు. అనంతరం ఉన్నత విద్యామండలి సీఎంకు పంపగా రాష్ట్రంలోని ఒక్కో యూనివర్సిటీకి వీసీ కోసం మూడేసి పేర్లను సూచిస్తూ ఆ ఫైల్‌ను గవర్నర్‌కు పంపగా ఆయన వీసీలను నియమిస్తారు.

27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభ

● హాజరుకానున్న ప్రముఖులు ● 13మందికి ప్రతిభా పురస్కారాలు

యానాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): యానాం కేంద్రంగా వెలువడుతున్న కవి సంధ్య, కవిత్వ పత్రిక స్థాపించి 50 సంచికలు పూర్తి చేసుకున్న సందర్భంగా 27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభను నిర్వహిస్తున్నట్టు కవిసంధ్య సంపాదకుడు కళారత్న డాక్టర్ శిఖామణి, పురస్కార కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజులు తెలిపారు. యానాం గీతా భవన్‌లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు సభ జరగనుంది. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాల ప్రదానం, శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవి సమ్మేళన కార్యక్రమాలు జరగనున్నాయి. కవి సంధ్య సంపాదకుడు కళారత్న శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ దీర్ఘాశి విజయ్‌భాస్కర్, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ వీరలక్ష్మీదేవి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్, డాక్టర్ ఆర్.సీతారం తదితరులు హాజరుకానున్నారు. కవి సంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే... ఈ సందర్భంగా 13 మంది (వచన, అభ్యుదయ, పత్రికా, లఘు కవిత, దళిత సాహిత్యం తదితర)కి ముఖ్య అతిథుల నుంచి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరిలో కొమ్మవరపు విల్సన్‌రావు, కపిల రాంకుమార్, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ఎన్.ఈశ్వరరెడ్డి, కాళ్ళకూరి శైలజ, జీవీ రత్నాకర్, మార్ని జానకిరామచౌదరి, మోకా రత్నరాజు, సరికొండ నరసింహరాజు, కోలాటి పెద్దిరాజు, కొండూరి రమరాజు, ఎస్‌వీ రామశాస్త్రి ఉన్నారు.

అన్నవరం వచ్చిన ఉద్యోగులకు పోస్టింగ్‌లు

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇతర దేవస్థానాల నుంచి అన్నవరం దేవస్థానానికి వచ్చిన ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇస్తూ గురువారం ఈవో రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీపై తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్‌లు వచ్చారు. మరో 9 మందికి వేరే విభాగానికి మార్చినట్టు అధికారులు తెలిపారు.

హుండీల ఆదాయం రూ.16.12 లక్షలు

సామర్లకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో 225 రోజులకు హుండీల ద్వారా రూ.16 లక్షల 139తో పాటు, విదేశీ కరెన్సీ రూ.12,492 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు గురువారం తెలిపారు. దేవదాయ తనిఖీ అధికారి ఫణి కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఉండూరుకు చెందిన లక్ష్మీ నారాయణ సేవా సంఘం భక్తులు ఉదయం నుంచీ హుండీలు లెక్కించారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ఇక రుడా వెంచర్లు

పీపీపీ విధానంలో అభివృద్ధి

అక్రమ లేఅవుట్లకు అనుమతులు ఇవ్వొద్దు

తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా వెంచర్లు వేసి పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) చైర్‌పర్సన్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రుడా నిర్వహించిన ఐదో బోర్డు సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను రుడాకు స్వాధీనం చేసే విధానంపై ఆలోచించాలన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో అనధికార లేఅవుట్లను గుర్తించాలన్నారు. రుడా పరిధిలో దరఖాస్తుల సమయంలో యూజర్ చార్జీల కింద వసూలు చేసే మొత్తాన్ని రూ.500 నుంచి రూ.1000కు పెంచినట్టు తెలిపారు. రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంతో చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో రుడా సెక్రటరీ శైలజ, టూరిజం ఆర్డీ వి.స్వామినాయుడు, ఇన్‌చార్జి డీజీవో ఎం.నాగలత, ట్రాన్స్‌కో ఎస్ఈ కె.తిలక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ అండర్-14 బాలురు, బాలికలు జిల్లా జట్ల ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్ల ఎంపికలను గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 11న శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, డీవైఈవో ఈవీవీఎస్ఎన్‌బీఎల్ నారాయణ, డీఐ బి.దిలీప్‌కుమార్, జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, కార్యదర్శి నాగరాజు, ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని వినతి

దివాన్‌చెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పీజీ సెట్ రాయని అభ్యర్థులకు విశ్వవిద్యాలయంలో పీజీ చదువుకునేలా స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని ఉప కులపతి శ్రీనివాసరావుకు అనూరా అలూమ్ని (పూర్వ విద్యార్థుల సంఘం) అధ్యక్షుడు గాదె కిషోర్, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ కె.కమలకుమారి, కార్యదర్శి, స్పృహ అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర నాగేంద్రకిషోర్ వినతిపత్రం అందజేశారు. పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సుల్లో భర్తీకాని సీట్లకు ఏపీ పీజీసెట్ రాయని అభ్యర్థులకు కూడా స్పాట్ అడ్మిషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించి ఆ మేరకు చర్యలు తీసుకుంటామని వీసీ చెప్పారు.



గుమ్మళ్లదొడ్డిలో రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు

అస్సాగో బ్యాక్

ఇథనాల్ పరిశ్రమను తొలగించే వరకు దీక్ష విరమించేది లేదు

ఉద్యమ ప్రతినిధులు శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి స్పష్టీకరణ

అస్సాగో కంపెనీ ముట్టడికి నిరసనకారుల యత్నం

గుమ్మళ్లదొడ్డిలో భారీ ర్యాలీ.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

గోకవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాలుష్య కారకమైన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి స్థానికులకు పూర్తి విముక్తి కలిగే వరకు దీక్ష విరమించబోమని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ని యోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమ నిర్వహణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరవధిక దీక్ష గురువారం మూడో రోజుకు చేరుకుంది. శిబిరాన్ని గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు సందర్శించి సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా పరిశ్రమ నిర్వహణను ప్రోత్సహించేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు.

మూడు రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి ఆరోగ్యం క్షీణిస్తోంది. రక్తప్రసరణ, షుగర్ లెవెల్స్ క్రమంగా తగ్గుతున్నాయి. ప్రభుత్వ వైద్యులు వారికి గంట గంటకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఆర్డీవో కృష్ణానాయక్

దీక్షా శిబిరం వద్ద నుంచి కంపెనీని ముట్టడించేందుకు నిరసనకారులు భారీ ర్యాలీగా బయల్దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున చేరుకుని ప్రధాన రహదారిపై అడ్డుకున్నారు. దీంతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయ ఏర్పడింది. ఆ సమయంలో ఇతర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు కంపెనీ నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామంటూ నిరసనకారులకు మద్దతు తెలిపారు.

అస్సాగో పరిశ్రమను రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణానాయక్ పరిశీలించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి బాధితులతో చర్చించారు. పరిశ్రమ ఏర్పాటుతో కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేసి తద్వారా పరిష్కార మార్గం చూపుతామని బాధితులకు సూచించారు. కమిటీ ఏర్పాటును నిరసనకారులు పూర్తిగా విభేదించారు. కంపెనీని పూర్తిగా తొలగించే వరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అస్సాగో సమస్య పరిష్కారానికి కమిటీ: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ సమస్య పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం ఆమె తన చాంబర్‌లో పరిశ్రమలు, పర్యావరణ శాఖల అధికారులతో సమీక్షించారు. కమిటీలో సమన్వయ శాఖల అధికారులు, గ్రామస్తులు, పరిశ్రమ ప్రతినిధులు ఉంటారన్నారు. ఇది పరిశ్రమలో కాలుష్య ప్రభావం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, గ్రామస్తుల అభ్యంతరాలపై అధ్యయనం చేస్తుందన్నారు. అధికార బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడుతుందని చెప్పారు. సమావేశంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి రామన్, ఉమ్మడి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎంబీఎస్ శంకరరావు, ప్రమోషనల్ అధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూడ్చి పెట్టిన మృతదేహానికి శవపంచనామా

ఆలమూరు, అక్టోబరు 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడుకు చెందిన చెక్కపల్లి వెన్నెల (15) ఈ నెల 18న ఆత్మహత్యకు పాల్పడింది. గోదావరి తీరంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. ఆలమూరు తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు అధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులు, బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ నెల 18న వెన్నెల ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ రోజే మడికి వద్ద గోదావరిలో పూడ్చి పెట్టారు. తన కుమార్తె చెముడులంకలోని షిర్డిసాయి విద్యానికేతన్‌లో పదో తరగతి చదువుతోందని, దసరా సెలవులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్కూలు యాజమాన్యం బెదిరించిందని, దీంతో పదో తరగతి పాస్ కాలేననే ఉద్దేశ్యంతో ఆత్మహత్యకు పాల్పడిందని వెన్నెల తండ్రి చెక్కపల్లి శ్రీనివాస్ ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌కు మద్దతుగా వెన్నెల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బుధవారం రాత్రి భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వెన్నెల కుటుంబానికి న్యాయం చేయాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. కాగా ఫిర్యాదు నేపథ్యంలో ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆలమూరు ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్.రాము, ఏఎస్ఐ సూర్యచంద్రరావుతో పాటు పలువురు ఇబ్బంది సమక్షంలో శవపరీక్షకు ఏర్పాట్లు చేశారు. పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తహసీల్దారు ప్రకాష్‌బాబు సమక్షంలో బయటకు తీసి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.



గోదావరి తీరంలో పూడ్చిపెట్టిన బాలిక మృతదేహన్ని వెలికితీసి పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం



నిందితులతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న మోతుగూడెం ఎస్ఐ

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు

మోతుగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం ఎస్ఐ కె.శివనారాయణకు వచ్చిన సమాచారంతో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రంలోని పసుపుల్లంక గ్రామం నుంచి విజయవాడకు అక్రమంగా తరలిస్తున్న రూ.10వేలు విలువైన రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షేక్ రిజ్వాన్, కూరగంటి సుభాష్‌లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, పీసీఎస్ ఈశ్వరరావు, ఎస్ఆర్‌కే రాజు, ఏఆర్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమోన్మాదం

● వివాహితపై యువకుడి హత్యాయత్నం

● తిరుగుడుమెట్టలో ఘటన ● వివరాలు సేకరించిన తాళ్లపూడి పోలీసులు

తాళ్లపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను ఒప్పుకోలేదని ఒక ఉన్మాది వివాహితపై హత్యాయత్నానికి తెగబడ్డాడు. ఏలూరు జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి హరినాథ్ డిగ్రీ చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం గ్రామానికి చెందిన యువతి అమ్మమ్మ ఊరైన దెందులూరు వెళ్లింది. ఆ యువతిని చూసిన హరినాథ్ ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. అందుకు ఆమె ససేమిరా అంది. తమ బంధువుల అబ్బాయితో పెళ్లి కుదిరింది వదిలేయమని వేడుకుంది.. అయినా పట్టించుకోకుండా వెంటపడుతూనే ఉండేవాడు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట తూర్పు గోదావరి జిల్లా తిరుగుడుమెట్టకు చెందిన బంధువుల అబ్బాయితో వివాహమైంది. అయినా ఆమెను వదల్లేదు. ఫోన్ చేసి వేధిస్తూనే ఉన్నాడు. ఆమె స్పందించకపోవడంతో ఉన్మాదిగా మారి గురువారం ఉదయం తిరుగుడుమెట్ట చేరుకున్నాడు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుందాం రమ్మని పట్టుబట్టాడు.. అయినా మాట వినలేదు.. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుండగానే తన వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె పొట్ట భాగంలో పొడిచి పారిపోయాడు. గాయాలపాలైన మహిళను స్థానికులు వెంటనే కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి బాగానే ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనపై తాళ్లపూడి పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉన్మాది పరారీలో ఉన్నట్టు పోలీసులు చెప్పారు.

ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శ్రీనివాసరావు

అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం



గోల్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంటును గురువారం ఆయన గోల్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉమ్మడిగోదావరి జిల్లాల్లో నన్నయ విశ్వవిద్యాలయం తరపున 42 రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంతో ప్రతిభావంతులైన గ్రామీణ యువత వెలుగులోకి వచ్చి ఉన్నత స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పురుషుల టోర్నమెంట్-కమ్-విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలకు వివిధ కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారన్నారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో ప్రతిభ కనబరిచిన జట్టు వచ్చే నెల 1నుంచి 5వ తేదీ వరకు బెంగళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, క్రీడా బోర్డ్ ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులైన రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు రమణ, విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

బియ్యం గుట్టు... రట్టు

ప్రిన్సిపాల్ క్వార్టర్స్‌లో 1,700 కిలోల బియ్యం నిల్వలు

ఎంపీపీ తనిఖీలో వెలుగు చూసిన వైనం



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి



తుప్పల్లో దాచి వుంచిన బియ్యం బస్తాలు

రాజవొమ్మంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసానికి వచ్చిన విద్యార్థినులను కార్మికులుగా మార్చడమే కాకుండా ఏకంగా దొంగలను చేసింది ఓ ప్రిన్సిపాల్. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రభుత్వ బాలికల గురుకుల కళాశాలలో వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... ఎంపీపీ గోము వెంకటలక్ష్మి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని విద్యార్థులను ఆరా తీశారు. ఆ సమయంలో మెస్ పక్కనే ఉన్న ప్రిన్సిపాల్ క్వార్టర్‌లో ఇంగ్లీష్ లెక్చరర్ ఉంటున్నారని, అక్కడ వేల కిలోల బియ్యం అక్రమంగా నిల్వ చేసి ఉంచినట్టు ఆమె తెలుసుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులకు, పాత్రికేయులకు సమాచారం అందించారు. హుటాహుటిన కళాశాలకు వచ్చిన రెవెన్యూ అధికారులు క్వార్టర్ తాళం లేకపోవడంతో కళాశాలలో ఉండాల్సిన స్టాక్, ఉన్న స్టాక్ వివరాలను చూశారు. బియ్యం నిల్వ చేసిన క్వార్టర్ వెనుక వైపు నుంచి వచ్చిన ప్రిన్సిపాల్ బస్తాలను తుప్పల్లోకి మోయలంటూ విద్యార్థినులను ఆదేశించారు. దీంతో వారు బియ్యం బస్తాలను సుమారు 100మీటర్ల దూరంలో ఉన్న తుప్పల్లోకి తీసుకెళ్లారు. దీనిని గమనించిన ఎంపీపీ వెంకటలక్ష్మి క్వార్టర్ వెనుక వైపునకు వెళ్లడంతో నాలుగు బస్తాలను తుప్పల్లో వదిలి 8 మంది విద్యార్థినులు పరుగులు తీశారు. ప్రిన్సిపాల్ సలోని తీరుపై ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఐటీడీఏ పీవోకు, కలెక్టర్‌కు జరిగిన ఘటనను ఫోనులో నివేదించింది. వెంటనే స్పందించిన పీవో డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతిని విచారణ అధికారిగా నియమించారు. ఉదయం 11 గంటల నుంచీ బియ్యం నిల్వ చేసిన క్వార్టర్ తాళాలను ప్రిన్సిపాల్ ఇవ్వకపోవడంతో రెవెన్యూ అధికారులు ఆ గదిని సీజ్ చేశారు. సాయంత్రం డీడీ విజయశాంతి వచ్చే వరకు రెవెన్యూ సిబ్బంది, ఎంపీపీ అక్కడే నిరీక్షించారు. విజయలక్ష్మి వచ్చి మండల అధికారుల సమక్షంలో క్వార్టర్ తెరిచి దర్యాప్తు నిర్వహించారు. అనంతరం డీడీ విజయశాంతి పాత్రికేయులతో మాట్లాడుతూ... క్వార్టర్‌లో 34 బస్తాల్లో 1,700 కిలోల బియ్యం, 10 కిలోల చింతపండు నిల్వ వుంచినట్టు గుర్తించి వాటిని అడ్డతీగల ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని, దీనికి పూర్తి బాధ్యత తనదే అని ప్రిన్సిపాల్ సలోని ఒప్పుకున్నారని చెప్పారు.

దర్యాప్తులో భాగంగా కళాశాల విద్యార్థినులను డీడీ ప్రశ్నించగా స్టాక్ పాయింట్ నుంచి 34 బస్తాలను దసరా సెలవులకు ముందు తామే ప్రిన్సిపాల్ క్వార్టర్‌లోకి మోసామన్నారు. గురువారం అధికారుల తనిఖీల సమయంలో కూడా ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకే బియ్యం బస్తాలను క్వార్టర్ వెనుక నుంచి తుప్పల్లోకి తీసుకెళ్లామన్నారు. విద్యార్థినులతో బియ్యం బస్తాలు మోయించడంపై ఎంపీపీ గోము వెంకటలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీడీ విజయశాంతి మాట్లాడుతూ ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని, ప్రిన్సిపాల్‌పై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

ఏవీ నగరంలో అర్ధరాత్రి అలజడి

● మహిళ ఇంటికి వచ్చిన యువకుడు ● ఇటీవల మహిళ భర్త మృతి

● వారిద్దరే హత్య చేశారని బంధువుల ఆరోపణ

● పోస్టుమార్టానికి సిద్ధమవుతున్న అధికారులు

తొండంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరంలో గురువారం అర్ధరాత్రి వేళ ఒక యువకుడు ఒక మహిళ ఇంటికి రావడంతో గ్రామంలో అలజడి చెలరేగింది. మహిళతో పాటు యువకుడిని గ్రామస్తులు నిలువరించారు. అర్ధరాత్రి వేళ యువకుడు రావడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆరా తీశారు. యువకుడి పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏవీ నగరం దళిత కాలనీకి చెందిన బత్తిన మధుబాబు (38) ఈ నెల 18న మృతి చెందాడు. ఆయన భార్య శిరీష, శంఖవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన పీతల ప్రశాంత్‌కుమార్ గతంలో ఒక ఆసుపత్రిలో పని చేశారు. శిరీష ఇంటికి ప్రశాంత్‌కుమార్ అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా రావడాన్ని గమనించిన స్థానికులు, బంధువులు ఈ వేళ రావాల్సిన అవసరమేముందని వారిని నిలదీశారు. అంతేగాక మధుబాబు మృతికి వారిద్దరే కారణమని బంధువులు అనుమానిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తొండంగి పోలీసులకు తెలిపి మధుబాబుది సహజ మరణం కాదన్న అనుమానం వ్యక్తం చేశారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ మధుబాబు మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పూడ్చిపెట్టిన మధుబాబు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

లారీని ఢీకొన్న వ్యాన్

తీవ్ర గాయాలతో డ్రైవర్ మృతి



మృతుడు గురునాయుడు (పాత చిత్రం)

తుని రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం చేపూరు సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. విజయవాడ నుంచి విజయనగరం కోడిగుడ్లతో వెళ్తున్న వ్యాన్ గవరయ్య కోనేరు వద్దకు చేరుకునే సమయంలో ఎదురు చక్రం పాడవ్వడంతో ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. క్యాబిన్‌లో చిక్కుకోగా తీవ్ర గాయాలతో మృతి చెందాడు. తుని రూరల్ పోలీసులుసంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు వెల్లడించారు. మృతి చెందిన డ్రైవర్ కల్యాణపు గురునాయుడు (30) విజయనగరం జిల్లా గొర్ల గ్రామానికి చెందిన వాడని, అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.



అత్యాచారయత్నం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ భీమరాజు, శివకృష్ణ

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు

క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

పి.గన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పక్షపాతంతో బాధపడుతూ కొన్నాళ్లుగా మంచంపైనే ఉన్న వృద్ధురాలిపై కనికరం లేకుండా అత్యాచార యత్నం చేశాడు ఓ ఉన్మాది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఐ.పోలవరం మండలం జి.మూలపొలానికి చెందిన ఓ వృద్ధురాలు రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతోంది. నాలుగు నెలల క్రితం పి.గన్నవరం మండలంలోని కుమార్తె ఇంటికి వచ్చింది. కుమార్తె ఈ నెల 23వ తేదీన ఒక కార్యక్రమానికి వెళ్లింది. సాయంత్రం 4.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చింది. ఒక వ్యక్తి తనపై అత్యాచారయత్నం చేశాడని వృద్ధురాలు కుమార్తెకు తెలిపింది. అదే గ్రామానికి చెందిన లంకె సత్యనారాయణ ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని భావిస్తూ కుమార్తె పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు అదే రోజు రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. గురువారం సీఐ భీమరాజు క్లూస్‌టీమ్ ఎస్ఐ ప్రవీణ్‌తో పాటు సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

పీహెచ్‌సీలో ఓపీలు పెరగాలి

అల్లవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బెండ మూర్లంక పీహెచ్‌సీలో అవుట్ పేషెంట్ల సంఖ్య పెరగాలని ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలకు వైద్యసేవలు అందించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బెండమూర్లంక పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది.

పోలియో డే

మలికిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలియో డే సందర్భంగా విశ్వేశ్వరాయపురం డే స్ప్రింగ్ ఇంగ్లీషు మీడియం స్కూలులో గురువారం విద్యార్థులకు పోలీయో గురించి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బత్తుల రూనీబాయి, కార్యదర్శి మట్టా రవి కుమార్, నల్లి శివ, ఓలేటి సతీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించండి

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల్లో జరగబోయే ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఓటు నమోదు, ఓటు హక్కు ప్రాధాన్యం, కొత్త ఓట్లు నమోదు తదితర అంశాలపై ఎమ్మెల్యే వివరించారు.పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాలరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలిచే విధంగా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకుని విజయం సాధించాలని సూచించారు. అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో శాసనమండలి వేదికగా సమర్థవంతంగా పనిచేస్తానన్నారు. విజయానికి సహకరించాలని కూటమి నాయకులను కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకు మారి, టీడీపీ నియోజవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, రాష్ట్ర సివిల్ సప్లయి డైరెక్టర్ మోకా ఆనందసాగర్, కూటమి నాయకులు దాసరి వీరవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, మద్దాల సుబ్బారావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాదనాల శ్రీవెంకటసత్యనారాయణ, మోల్లేటి శ్రీనివాస్, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్లను నమోదు చేయించండి

మలికిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతంగా ముందుకు వెళ్లాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు అన్నారు. గురువారం విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇంటి వద్ద జరిగిన సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నమోదు ప్రక్రియ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, రాపాక నవరత్నం, తాడి సత్యనారాయణ, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు నూతన అల్ట్రా డీలక్స్ బస్సు

అమలాపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు నూతనంగా ఏర్పాటుచేసిన అల్ట్రా డీలక్స్ బస్సును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం ప్రారంభించారు. డిపో మేనేజర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, జంగా అబ్బాయివెంకన్న, వలవల శివరావు, విజిలెన్స్ అధికారి రామారావు, గ్యారేజీ ఇన్‌చార్జి జీఆర్ఎల్ దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎన్.వరహాలబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఆర్డీవో పాఠశాల తనిఖీ

మలికిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గూడపల్లి ఎంపీపీ యూపీ పాఠశాలలో రక్షిత మంచినీటి సరఫరా జరగడం లేదని హెచ్‌ఎం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అమలాపురం ఆర్డీవో కె.మాధవి గురువారం పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలకు తాగునీటి సరఫరాపై చర్చించారు. ప్రస్తుతం పాఠశాలకు బోరు ద్వారా ఆర్వో ప్లాంటు ఉందని, ఆ ప్లాంటుకు ఆర్‌డబ్ల్యుఎస్ వాటర్ కావాలని పాఠశాల సిబ్బంది కోరారు. ఆర్డీవో మాధవి ఎండీవోకు తగు చర్యలు నిమిత్తం సిఫార్సు చేశారు. ఎంపీడీవో ఎన్.బాలాజీ మాట్లాడుతూ పంచాయతీ నుంచి వెంటనే పాఠశాలకు తాగునీటి సరఫరా ఏర్పాటు చేస్తామని ఆర్డీవోకు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడీవో బాలాజీ ఉన్నారు.

బీకేఎస్ మండల అధ్యక్షుడిగా ఆనందవెంకటప్రసాద్

అంబాజీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) మండలఅధ్యక్షుడిగా కొప్పిశెట్టి ఆనందవెంకటప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పుల్లేటికుర్రులో బీకేఎస్ మండల శాఖ సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా అయ్యగారి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా మట్టపర్తి భాస్కరరావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు, నిట్టాల సాయి, మట్టపర్తి రాంబాబు ఎన్నికయ్యారు.

లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వ నమోదు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న సంఘటనా మంత్రి మధుకర్‌జీ

అమలాపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వ నమోదును పూర్తి చేయాలని బీజేపీ సంఘటనా మంత్రి మధుకర్‌జీ పేర్కొన్నారు. అమలాపురం పార్లమెంటు జిల్లా క్రియాశీలక సభ్యత్వ నమోదు వర్క్‌షాపు అమలాపురంలో గురువారం జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటరామ్మోహనరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమాతో పాటు మధుకర్‌జీ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ మండలంలోను బూత్ స్థాయి నుంచి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. మండలాల వారీగా శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్, మండల శాఖల అధ్యక్షులు ఇప్పటి వరకు పూర్తిచేసిన సభ్యత్వాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యశాలలో జిల్లా ఇన్‌చార్జి పొట్టూరి రామ్మోహనరావు, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జిల్లా ఇన్‌చార్జి యిళ్ల సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, మోకా వెంకటసుబ్బారావు, దూరి రాజేష్, మాలే శ్రీనివాసనగేష్, ఆకుమర్తి బేబిరాణి, చిట్టూరి రాజేశ్వరి, చిలకమర్రి కస్తూరి, విళ్ల దొరబాబు, కొండేటి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై సీఎంతో సమీక్ష


సీఎం, ఇతర అధికారులతో చర్చిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యానాం పెండింగ్ అంశాలపై పుదుచ్చేరి సీఎం రంగసామి నేతృత్వంలో సమీక్ష సమావేశం నిర్వహించినట్టు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. వివరాలను మీడియ ప్రతినిధులకు వివరించారు. సీఎం నేతృత్వంలో జరిగిన సమావేశంలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్, జీఏడీతో పాటువివిధ శాఖలకు చెందిన కార్యదర్శులు హాజరయ్యారు. యానాం నుంచి రెగ్యులర్ అయ్యి, పుదుచ్చేరిలో పని చేస్తున్న 25మందిఉద్యోగుల కుటుంబ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని యానాం బదిలీ చేయాలని కోరిన నేపథ్యంలో శాఖపరమైన అంశాలపై చర్చించి త్వరలో బదిలీ చేస్తారని మల్లాడి వివరించారు. యానాంలోని ఆరోగ్యశాఖ, విద్య తదితర శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది పెండింగ్ జీతాలు, యానాంలో రిక్రియేషన్ పేరుతో క్లబ్‌లు రాకుండా సుప్రీంకోర్టు వచ్చిన తీర్పు మేరకు మున్సిపాల్టీ నుంచి అనుమతులు ఇవ్వకూడదని, క్లబ్‌లపై ప్రభుత్వ పరంగా చట్టాన్ని తీసుకోవాలని కోరినట్టు మల్లాడి వివరించారు. మాస్టర్‌ప్లాన్, మత్స్యకారుల రెండో విడత పరిహారం, టెంపుల్ కమిటీ తదితర అంశాలపై చర్చించారు.

అయ్యప్పస్వామి పడి పూజ



ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రమేష్ గురుస్వామి 25వ శబరిమల మాలధారణను పురస్కరించుకుని ముమ్మిడివరంలో శ్రీస్వామి అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కోనసీమ జిల్లాలోని మాలధారణ చేసిన అయ్యప్పస్వాములంతా ముమ్మిడివరంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద భిక్షా కార్యక్రమం ముగించుకుని అనంతరం స్వాములంతా పేటతుళ్లై ఆడుతూ కలశాలను నెత్తిన పెట్టుకుని బ్యాండు మేళాలతో ఊరేగింపుగా సాయిబాబా మందిరం వద్దకు చేరుకుని అక్కడ పవిత్ర జలాలను సేకరించి కలశాలను నెత్తిన ధరించి పాటలు పాడుకుంటూ శరణుఘోషతో అయ్యప్పస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. పవిత్ర జలాలతో పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ బాబిశర్మ మంత్రోచ్ఛారణల నడుమ గణపతి, సుబ్రహ్మణ్య, కనకదుర్గమ్మ, వేంకటేశ్వరస్వామి సహిత అయ్యప్ప స్వామికి 18 మెట్ల పడిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గురు స్వాములను ఘనంగా సత్కరించారు. మానేపల్లి ప్రకాష్ గురుస్వామి బృందం ఆలపించిన అయ్యప్పస్వామి గీతాలు విశేషంగా ఆకర్షించాయి. భజన, పడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెన్మెత్స జగ్గప్పరాజు, పి.సీతారాముడు, కె.రామలింగేశ్వరరావు, వి.చిన్నారావు, ఎం.లక్ష్మణరావు, బి.అయ్యప్ప, ఆర్.గోవింద గురుస్వాములతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో స్వాములు తరలివచ్చి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

పి.గన్నవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లతో భాగస్వామ్యమై గ్రామాల అభివృద్ధిలో ఎంపీటీసీలు పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కూటమి నేతల జెంటిల్‌మన్ ఒప్పందం ప్రకారం మండల ఎంపీటీసీల సమైఖ్య అధ్యక్షురాలిగా నరేంద్రపురం ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి ఎంపిక య్యారు. ఈసందర్భంగా స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆమెకు అభినందనలు తెలిపి అనంతరం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టిందని, నిధుల విషయంలో దశలు వారీగా అన్ని గ్రామాలకు సమానంగా నిధులు కేటాయిస్తామన్నారు. ఇచ్చిన నిధులు సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం నూతన సమైఖ్య అధ్యక్షురాలిని సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధ నాల శ్రీవెంకటసత్యనారాయణ, షేక్ దొరబాబు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

మలికిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అడివిపాలెం పంచాయతీకి చెందిన సర్వే నంబరు 545/5లో 1.96సెంట్ల భూమి సర్వేకు గ్రామస్తులంతా సహకరించాలని తహసీల్దార్ టి.శ్రీనివాస్ కోరారు. అడివిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో అదే గ్రామానికి చెందిన సర్వేను వ్యతిరేకిస్తున్న వర్గీయులతో మూడు గంటలు చర్చించారు. సర్వేచేసి మిగులు భూమిని గుర్తిస్తామని, ఎవరికీ ఎటువంటి అన్యాయం జరగదని ఆయన అన్నారు. ఎస్‌ఐ పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ విధులకు ఆటంకం కల్పిస్తే చర్యలు తప్పవన్నారు. శుక్రవారం సర్వే చేసుకోవడానికి సర్వేను వ్యతిరేకిస్తున్న వర్గం అంగీకరించడంతో కథ సుఖాంతమైంది. సర్వేయర్ మధుసూదనరావు, ఎంపీటీసీ ఆచంట మాణిక్యం, పంచాయతీ సభ్యులు కొమ్ముల దొరబాబు, కె.నరసింహమూర్తి, కార్యదర్శి బి.సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యం

అమలాపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కేంద్ర మానవ వనరుల శాఖ ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నట్టు భారత్ అభియాన్ రీజనల్ కోఆర్డినేటర్ పావని చెప్పారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఉన్నత భారత్ అభియాన్ వర్క్‌షాపును ఇంజనీరింగ్ విద్యార్థులతో నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన పావని మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా కళాశాల సమీప గ్రామాల అభివృద్ధి జరుగుతుందని వివరించారు. విద్యార్థులకు ఉన్నత భారత్ అభియాన్ లక్ష్యాలు, ఆశయాలను వివరించారు. ఈ సందర్భంగా పావనిని సత్కరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంసీఎస్ మదన్, ఏవో జక్కం వెంకటకృష్ణారావు, కోఆర్డినేటర్ గమిని మూర్తి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగల మరమ్మతుల నిమిత్తం 11కేవీ ఠాణేలంక, 11కేవీ కొత్తలంక పరిధిలో శుక్రవారం ఉదయం 9నుంచి ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నటట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ముమ్మిడివరం, ముమ్మిడివరం అగ్రహారం, ఠాణేలంక, లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక, కూనాలంక, కొత్తలంక, చినకొత్తలంక, అన్నంపల్లి, కొమానపల్లి, గేదెల్లంక, వడ్డిగూడెం, గోదాశివారిపాలెం, కర్రివానిరేవు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

పి.గన్నవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ మరమ్మతులు కోసం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటలు వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు. నరేంద్రపురం, రాజులపాలెం, కుందాలపల్లి, ఉడిమూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, గంటిపెదపూడి గ్రామాలు, పశ్చిమగోదావరి జిల్లా పెదమల్లంక, అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కాట్రేనికోన, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం లైన్ల మరమ్మత్తుల కోసం సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. కాట్రేనికోన టౌన్, పల్లం, కందికుప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, బలుసుతిప్ప గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

రూ.45లక్షలకు టెండరు ఖరారు

అయినవిల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలను తరలించుకునేందుకు రూ.45లక్షల హెచ్చు టెండర్‌ను గ్రామానికి చెందిన విళ్ల వికాస్ దక్కించుకున్నాడు. గురువారం దేవదాయశాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో టెండరు ప్రక్రియను గ్రామస్తుల సమక్షంలో నిర్వహించారు. గత ఏడాది రూ.44.55లక్షలకు టెండరు వెళ్లింది.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రిజర్వు బ్యాంకు నిబంధనల మేరకు ఎటువంటి ష్యూరిటీ లేకుండానే కౌలు రైతులకు రూ.1.60లక్షలు చొప్పున పంట రుణాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా సమితి సమావేశం ధనవెంకటసత్యనారాయణ అధ్యక్షతన గురువారం ఎస్టీయూ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. అంతర్వేది దేవస్థానం భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని సమావేశం తీర్మానం చేసింది. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చెల్లుబోయిన కేశవశెట్టి, జిల్లాకార్యదర్శి బుజ్జిబాబు, కె.వరుణ్‌బాబు, దొండపాటి చిట్టిబాబు, శీలం వెంకటేశ్, గెడ్డం ప్రభాకర్, పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న సిబ్బందికి షోకాజ్ నోటీసులు

మలికిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 40రోజులుగా జీతాల బకాయిలు చెల్లించాలని సమ్మె చేస్తున్నా మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి సంస్థ పాలకవర్గం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.సతీష్ షోకాజ్ నోటీసులు అందజేశారు. సంస్థ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా మీరు వ్యవహరించిన కారణంగా మీపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో నోటీసు అందిన ఏడు రోజుల్లోపు కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా వివరణను తెలుగులో అందజేయాల్సిందిగా ఆదేశించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగుల ఆందోళన

యానాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజాపనుల శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. దీపావళికి ముందే బోనస్సు, జీతాలు ఇవ్వాలని కోరారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు నిర్మించకపోతే వాహనాలను అడ్డుకుంటాం

ఉప్పలగుప్తం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి ప్రధాన రహదారిని నవంబరు నెలాఖరులోగా నిర్మించకపోతే ఓఎన్జీసీ వాహనాలను అడ్డుకుంటామని సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్.యానాం అన్‌లోడింగ్ పాయింట్‌కు వివిధ ప్రాంతాల నుంచి తమ గ్రామం మీదుగా ట్యాంకర్ల ద్వారా ఆయిల్‌ను తరలిస్తున్న ఓఎన్జీసీ రహదారిని నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గుంతలు పూడ్చి, నెల రోజుల్లో రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, గొలకోటి చిన్నా, కె.భగవాన్‌దాస్, గొలకోటి కామరాజు, జె.శ్రీనివాసరావు, బూసి బుజ్జిదొర, దంగేటి సూర్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఓటు నమోదుపై అవగాహన

కాట్రేనికోన, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారు ఓటర్లగా నమోదు కావాలని తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారం సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఫారం-6పత్రాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ కె.రవి, కరస్పాండెంట్ ఎం.నాగరాజు, వీఆర్వోలు వెంకటేశ్వరరావు, పులుగు ప్రసాద్, మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు వెలుగులు

అల్లవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి పాలనలో గ్రామ పంచాయతీలకు వెలుగులు నింపుతున్నామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గోడితిప్ప పంచాయతీ గోపాయిలంకలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆనందరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, లింగోలు పండు, కంకిపాటి వీరబాబు, సర్పంచ్‌లు చిట్నీడి శ్రీదేవిశ్రీనివాస్, తిక్కిరెడ్డి శ్రీనివాస్, మాకిరెడ్డి సత్తిబాబు, తోరం చిన్నబ్బులు, చాట్ల మంగతాయారు, కొప్పుల నాగమానస, కంకిపాటి గోపి, రాసూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హిందీ టీచర్ అన్నపూర్ణకు నివాళి

పి.గన్నవరం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్ హిందీ ఉపాధ్యాయిని అన్నపూర్ణ అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం కింద రూ.3 లక్షలను భర్త కంబంపాటి అప్పారావుకు అందించారు. అనంతరం పి.గన్నవరంలో హైస్కూల్లో ఇంటర్ చదువుతున్న 16మంది విద్యార్థులకు జత యూనిఫామ్స్ అప్పారావు అందించారు. యూటీఎఫ్ ప్రతినిధులు పెంకే వెంకటేశ్వరరావు, నల్లి విశ్వనాథ్, ఎంఈవోలు కె.హెలీనా, చింతా వీరభద్రం, ప్రధానోపాధ్యాయుడు డి.ఎస్.వి.ప్రసాద్, స్థానిక యూటీఎఫ్ నాయకులు డి.రామకృష్ణ, వరిగేటి రత్నం, గిడ్ల శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్ పేర్రాజు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సుజాత కుటుంబానికి చెక్కు అందజేత

అంతర్వేది, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం హైస్కూలులో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్న సీహెచ్ సుజాత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా రూ.3లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్సీ ఐవీ అందించారు. తొలుత సుజాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉపాధ్యాయులతో పాటు ప్రతీ ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని ఎమ్మెల్సీ ఐవీ కోరారు. మండల విద్యాశాఖాధికారులు బి.కిశోర్‌కుమార్,ఎం.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పరిశోధన కేంద్రం సందర్శన

అంబాజీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురువారం సందర్శించారు. పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు, మొక్కల రకాలు, ల్యాబ్, తెగుళ్లు, పురుగులు, యాజమాన్య పద్ధతులపై పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు అవగాహన కల్పించారు. కోకో పంటలు, కొబ్బరి చెట్లు ఎక్కే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.శాంతికుమార్, జి.రమ్య, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

అంబాజీపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వివాహిత రెండేళ్ల బాలుడితో అదృశ్యంపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఓ గ్రామానికి చెందిన వివాహిత ఈనెల22వ తేదీన రెండేళ్ల బాలుడితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ప్రసాద్ తెలిపారు.

రామచంద్రపురం ఆర్డీవోగా అఖిల

ద్రాక్షారామ(రామచంద్రపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్డీవోగా దేవరకొండ అఖిలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన ఖతీబ్ కౌసర్ భానును తాడేపల్లిగూడెం ఆర్డీవోగా నియమిస్తూ ప్రభుత్వం బదిలీ చేసింది.

ఊరికి దూరంగా జగనన్న ఇళ్ల స్థలాలు

- వెదురుపాకలో జగనన్న లేఅవుట్‌పై లబ్ధిదారుల అనాసక్తి
- నెరవేరని లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ కల
- 91మంది లబ్ధిదారుల్లో ఒక్కరూ కూడా నిర్మాణం చేపట్టని వైనం



వెదురుపాకలో ఖాళీగా ఉన్న జగనన్న లేఅవుట్ స్థలాలు

రాయవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మేం కట్టించేది ఇళ్లు కాదు ఊరు అంటూ గొప్పగా ప్రచారం చేస్తుకున్న జగన్ ప్రభుత్వం ఊరి మాట దేవుడెరుగు లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాలు ఊరికి దూరంగా ఉండటంతో, ఇళ్లు నిర్మించుకునేందుకు అనువైన వాతవరణం కల్పించకపోవడంతో వెదురుపాక గ్రామంలో జగన్న లేఅవుట్లపై లబ్ధిదారులు అనాసక్తి చూపుతున్నారు. వెదురుపాక గ్రామంలో వెదురుపాక- ఆరికరేవుల రోడ్డులో తుమ్మారి చెరువు వద్ద లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చినప్పటికీ లేఅవుట్ స్థలంలో మెరక పనులు జరగకపోవడంతో ఆ స్థలంలో ఒక్క ఇల్లు కూడా నిర్మాణం జరగలేదు. లబ్ధిదారులకు సుమారు రెండున్నర సంవత్సరాల క్రితం పట్టాలు ఇచ్చారు. ఎన్నికల ముందు జనవరి నెలలో హడావిడిగా మెరక పనులు చేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. జగనన్న లేఅవుట్‌లో 143ప్లాట్లు ఉండగా 91మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి మెరక పనులు పూర్తిచేసి ఈఏడాది ఫిబ్రవరి ప్లాట్లు కేటాయించడంతో అక్కడ 91మందిలో ఒక్క లబ్ధిదారుడు ఇళ్లు నిర్మాణం చేపట్టలేదు. ఊరికి దూరంగా ఉండటంతో పాటు చుట్టూ పొలాల మధ్య కనీస వసతులు లేకపోవడంతో ఒక్క లబ్ధిదారుడు అక్కడ ఇల్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఊరికి దూరంగా కాకుండా తమకు గ్రామానికి దగ్గరగా ప్లాట్లు కేటాయించాలని ప్రజలు వైసీపీ నాయకులను కోరినా పట్టించుకున్న పాపాన పోలేదు. స్థలాలు కేటాయించిన రెండు సంవత్సరాల పాటు వైసీపీ నాయకులు లబ్ధిదారులను పట్టించుకోకపోగా ఎన్నికలు సమీపించడంతో హడావిడిగా మెరక పనులు చేపట్టి ప్లాట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని లబ్ధిదారులు నేటికి ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం అనాలోచిన నిర్ణయం వల్ల నేటికి తుమ్మారి చెరువు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం కల నెరవేరలేదు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారులు ఆశలు చిగురిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం మౌళిక వసతులు కల్పించడంతో పాటు స్థలాలు లేని వారికి స్థలాలు మంజూరు చేస్తే తిరిగి అక్కడ నిర్మాణాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

రూ.2కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్ కట్టా శ్రీరాములు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా సమావేశంలో ఆయనకు నివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు కౌన్సిలర్లు, అధికారులు మౌనం పాటించారు. వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ మాట్లాడుతూ కట్టా శ్రీరాములు బీసీ సంక్షేమశాఖ ఉద్యోగిగా, కౌన్సిలర్‌గా సేవలందించారని కొనియాడారు. అజెండాలో పొందుపరిచిన 15వ ఆర్థిక సంఘం నిధులతో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులపై చర్చ జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ ఎజెండాలో పొందుపరిచిన 22 పనుల్లో ఇప్పటికే పూర్తిచేసిన పనులు, చేపట్టాల్సిన పనులు వివరాలు తెలియజేయాలని కోరారు. 22పనుల్లో 8పనులు ఇప్పటికే పూర్తి చేశామని మరో 14పనులు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. కమిషనర్ టి.ఐ.పి.నాయుడు ఆదేశాలతో పనుల వివరాలు చదివి వినిపించారు. వార్డ్రే సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడాప్రాంగణానికి నిత్యం వాకింగ్, క్రీడాకారులు వస్తుంటారని, ప్రాంగణం కలుపు మొక్కలు, చెత్తతో నిండి ఉందని, క్రీడాప్రాంగణంలో మొక్కలు తొలగించాలని కోరారు. క్రీడాప్రాంగణం నిర్వహణ పురపాలక సంఘమే చేస్తుందని, అయితే క్రీడాప్రాంగణం నిర్వహణ కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు చేయాల్సి ఉందన్నారు. మున్సిపాలిటీకి ఏవిధమైన సంబంధం లేకపోయినా మున్సిపల్ నిధులతో క్రీడాప్రాంగణం నిర్వహణ చేయడం జరుగుతుందని, ట్రస్టు ఈవోకు నోటీసు ఇవ్వాలని సాయిప్రసాద్ కోరారు. ఈవోకు లెటర్ రాయాలని కమిషనర్ ఆదేశించారు. వెల్లవాటర్ వర్క్సు, పురపాలక సంఘం కార్యాలయానికి విద్యుత్ చార్జీలు రూ.8లక్షలు అవుతుందని, సోలార్‌విద్యుత్‌పై దృష్టిసారించాలని కోరారు. సోలార్ విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జన రద్దీ ఎక్కువగా ఉంటుందని స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు. పట్టణ సరిహద్దులో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని గతంలో తీర్మానం ఆమోదించామని, తీర్మానం అమలు జరపాలని కోరారు. సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు జాతీయ జెండా రంగులతో విద్యుత్‌దీపాలంకరణ చేయాలని కోరారు. చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు చైర్‌పర్సన్ శ్రీదేవి ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్‌తో సహా బదిలీపై వచ్చిన 14 మంది ఉద్యోగుల్ని కౌన్సిల్ సభ్యులకు పరిచయం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి



ఎమ్మెల్సీ ఓటు నమోదు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పరిశీలకులు, కూటమి నాయకుల దృశ్యం

కొత్తపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పార్టీ విజయానికి కార్యకర్తలే కీలకమని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక బండారు బులిసత్యం-చంద్రావతి కాపు కల్యాణ మండపంలో గురువారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విస్తృతస్థాయి సమావేశం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకులు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాలరెడ్డి, వాసిరెడ్డి రాంబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ కూటమి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉన్న పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశీస్సులతో ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ నిలిచారని, పట్టభద్రులు సమర్థునికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, దర్నాల రామకృష్ణ, పాలూరి సత్యానందం, అయినవిల్లి సత్తిబాబు, ముత్యాల బాబ్జి, గుత్తుల పట్టాభిరామయ్య, మెర్ల గోపాలస్వామి, కంఠంశెట్టి చంటి, తోట స్వామి, సూరపరెడ్డి సత్య, బండారు వీరబాబు, రెడ్డి తాతాజీ, చిలువూరి సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి తరలిరావాలి



కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు

రావులపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈనెల26న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే కార్యకర్తల సమావేశానికి జిల్లాలోని పార్టీ కార్యకర్తలు తరలి రావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం రావులపాలెంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు అధ్యక్షతన కొత్తపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ ఈనెల26న విజయవాడలో జరిగే సమావేశానికి డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివన్నారాయణ, కొప్పల రాంబాబు, గ్రంధి గిరి, ఉడిమూడి రాజు, కాసు మోను నాగు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): అంగర సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, మెయింటినెన్స్ కారణంగా పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం విద్యుత్‌శాఖ ఈఈ రత్నాలరావు తెలిపారు. కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచరమట్టలు, శ్రీరామపురం, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, వెదురుమూడి గ్రామాల్లో శుక్రవారం ఉదయం8 నుంచి 12గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

కొత్తపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం 33 కేవీ లైను పనుల నిమిత్తం కొత్తపేట, బిళ్లకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలో బిళ్లకుర్రు, వానపల్లి, పలివెల, అవిడి, గంటి, మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు ఉదయం8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు.

పోలియో డే

మలికిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలియో డే సందర్భంగా విశ్వేశ్వరాయపురం డే స్ప్రింగ్ ఇంగ్లీషు మీడియం స్కూలులో గురువారం విద్యార్థులకు పోలియో గురించి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బత్తుల ఝాన్సీబాయి, కార్యదర్శి మట్టా రవికుమార్, నల్లి శివ, ఓలేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి



తహసీల్దార్, అగ్నిమాపక, పోలీసు అధికారులతో సమీక్ష చేస్తున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని బాణసంచా దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ కోరారు. గురువారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో డివిజన్‌లోని తహసీల్దార్లు, పోలీసు, అగ్నిమాపక అధికారులు, లేబర్ డిపార్టుమెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తాత్కాలిక బాణసంచా దుకాణదారులు మండల త్రిసభ్య కమిటీ సూచించిన ప్రదేశంలో మాత్రమే బాణసంచా అమ్మకాలు చేపట్టాలని సూచించారు. అలాగే పోలీసు అధికారులు అనధికార బాణసంచా నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాలు సంభవించకుండా షాపు యజమానులకు పలు సూచనలు చేయాలని తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మండలస్థాయి అధికారులకు సూచించారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు మెర్లపాలెం విద్యార్థులు



రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం మెర్లపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీహరి, పీడీ శ్రీకాంత్ తెలిపారు. అండర్-17, 14, 19 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం హైస్కూల్‌లో సర్పంచ్ మెర్ల రాము, ఎస్ఎంసీ చైర్మన్ పువ్వల లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



కొత్తపేట, రామచంద్రపురం డివిజన్ జేఏసీ మహిళా కార్యవర్గాలు

మహిళా ఉద్యోగుల పట్ల వివక్ష, వేధింపులు

ఏపీ జేఏసీ మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ లక్ష్మి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులు వివక్ష, వేధింపులు ఎదుర్కొంటున్నారని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ కె.లక్ష్మీ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మహిళా ఏపీ జేఏసీ అమరావతి కార్యవర్గాలను రామచంద్రపురం, కొత్తపేట డివిజన్‌లకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడారు.

రెవెన్యూ డివిజన్ల మహిళా జేఏసీ కార్యవర్గాలు: రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ చైర్‌పర్సన్‌గా లోడ ఝాన్సీలక్ష్మీకుమారి, అసోసియేట్ చైర్‌పర్సన్‌గా డి.చైతన్యకుమారి, కోచైర్మన్‌గా కె.విజయరేఖ, ఎం.బిందు, ప్రధాన కార్యదర్శిగా జి.ఎల్.కుమారి, కార్యదర్శిగా లక్ష్మీలత, హరిచందన, కోశాధికారిగా పార్వతిని ఎంపిక చేశారు. కొత్తపేట రెవెన్యూ డివిజన్ చైర్‌పర్సన్‌గా పి.నాగలక్ష్మీ పద్మ, అసోసియేట్ చైర్‌పర్సన్‌గా ఎస్.గణికమ్మ, కోచైర్మన్‌గా డి.మీనా, వి.జగదీశ్వరి, ప్రధాన కార్యదర్శిగా పి.వి.ఎల్.కుమారి, కార్యదర్శిగా భారతి వెంకట లలితాదేవి, జి.అసంబేబి, కోశాధికారిగా కె.లావణ్యను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి కార్యదర్శి సునీత, జిల్లా జేఏసీ, ఏపీఆర్ఎస్‌సీ జిల్లా చైర్మన్ డి.శ్రీనివాస్, జిల్లా చైర్‌పర్సన్ సిహెచ్ నాగలక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శి లహరి, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, డివిజన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్.ఎన్.వి భాస్కర్, అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి బ్రహ్మోత్సవాలకు ప్రైవేట్ బస్సులు

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఉచిత ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోజూ బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఉచిత బస్సులో భక్తులను తీసుకు వచ్చి ఉచిత దర్శనం అందించి వారు వచ్చిన ప్రాంతానికి తీసుకువెళ్లే విధంగా ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరావు ఏర్పాట్లు చేశారు. నాల్గవ రోజు గురువారం ఆత్రేయపురం, వద్దిపర్రు, పేరవరం, బొబ్బర్లంక, వాసంతవాడ, ర్యాలీ, మెర్ల పాలెం, అంకంపాలెం, ఊబలంక గ్రామాలు నుండి ఆరు బస్సులు ద్వారా భక్తులు బ్రహ్మోత్సవాలు తిలకించే ఏర్పాట్లు చేశారు.

అవగాహన సదస్సుకు తరలిరండి

కె.గంగవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నిర్వహించే అవగాహన సదస్సుకు తరలిరావాలని జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి చిర్రా రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రామచంద్రపురం లయిన్స్ కల్యాణ మండపంలో జరిగే సదస్సుకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ హాజరవుతున్నారని, కూటమి నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

కె.గంగవరం, అక్టోబరు 24: భూసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. గురువారం అద్దంపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ఆర్ఐ వెంకట్రావు మాట్లాడుతూ సమస్యలున్న రైతులు దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, మండల సర్వేయర్ పావని, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



బెల్ట్‌షాపు ప్రాంతాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ కాత్యాయని

రావులపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బెల్ట్‌షాపులు, పాన్ షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని కొత్తపేట ఎక్సైజ్ సిఐ కాత్యాయని హెచ్చరించారు. గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తుండటంతో గురువారం ఊరూరికి బెల్ట్ కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సీఐ రావులపాలెం మండలంలోని పలు గ్రామాలలో బెల్ట్‌షాపులు నిర్వహించే ప్రాంతాలు, పాన్ షాపుల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఈతకోట ప్రాంతంలోని ఒక బెల్ట్‌షాపులో ఎనిమిది మద్యం సీసాలు, రెండు బీరు సీసాలు సీజ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బెల్ట్‌షాపుల తనిఖీలతో పాటు నాటుసారా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణ

మండపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలని డీఎస్పీ బి.రామకృష్ణ కోరారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాణసంచా విక్రేతలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు ఉంచినా లేదా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్ఐ సురేష్, టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి, మండపేట ఫైర్‌స్టేషన్ అధికారి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పేరాబత్తుల విజయానికి సమష్టిగా పనిచేయాలి

ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ కాటసాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉభయగోదావరి జిల్లాల నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండపేటలోని సూర్య ఫంక్షన్‌హాల్‌లో పేరాబత్తుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై కూటమి నేతలతో సమావేశం జరిపారు. ఈ సమావేశానికి పార్టీ పరిశీలకుడు రాయలసీమ ఎమ్మెల్సీ కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నుంచి పోటీ చేస్తున్న రాజశేఖర్‌ను గోదావరి జిల్లాల నుంచి గెలిపించే బాధ్యత అందరిపై ఉందన్నారు. మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ మాట్లాడుతూ కూటమి అభ్యర్థి విజయానికి క్యాడర్ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడుతూ తనను గెలిపించి ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. తొలుతగా ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు యరగతపు బాబ్జీ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ రంగారావు

నిల్వ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

మండపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో గురువారం శానిటేషన్ విభాగపు కార్యదర్శులతో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో అన్ని హోటళ్లు, రెస్టారెంట్‌లపై తనిఖీలు నిర్వహించి నిల్వ ఉంచిన పదార్థాలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటళ్లలో పనిచేస్తున్న వంట, ఇతర సిబ్బంది హెల్త్ సర్టిఫికెట్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈనిబంధనలు అన్ని బార్లు, రెస్టారెంట్స్‌కి వర్తిస్తాయన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా అన్ని వ్యాపార సముదాయాలను తనిఖీ చేయాలని, పట్టణంలో అన్ని వార్డుల్లో మెప్మా సిబ్బంది, ఆర్‌పీల ద్వారా తడి, పొడిచెత్త వేర్వురుగా చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని, ఈ కార్యక్రమాన్ని నిరంతరం అమలు జరపాలన్నారు.

ఆకతాయిలకు పోలీసుల కౌన్సెలింగ్

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో వివిధ కళాశాలల వద్ద మోటారు బైక్‌లపై చక్కర్లు కొడుతున్న ఆకతాయిలకు గురువారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒకే బైకుపై ముగ్గురు, నలుగురు కూర్చోవడం, ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం వంటి నేరాలకు పాల్పడుతున్న యువకులను పోలీసులు మఫ్టీలో ఉండి యువకులు, వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐలు జానీబాషా, లక్ష్మణ్, ఏఎస్ఐ ఆచారి వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకుల తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు.

బస్టాండ్‌లో చోరీపై ఫిర్యాదు

రావులపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రావులపాలెం బస్టాండ్‌లో బ్యాగ్ చోరీపై గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై టౌన్ సీఐ శేఖర్‌బాబును వివరణ కోరగా పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన తాడిగడప సుబ్బలక్ష్మి ఆత్రేయపురం మండలంలో రిజిస్ట్రేషన్ కోసం రావులపాలెం బస్టాండ్‌కు వచ్చిందన్నారు. బస్టాండ్ నుంచి ఆటో ఎక్కే క్రమంలో దగ్గర ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయి వెళ్లిపోయిందని తెలిపారు. తిరిగి వచ్చి చూడగా అక్కడ బ్యాగ్ కనిపించలేదన్నారు. దీంతో స్టేషన్‌కు వచ్చి విలువైన వస్తువులున్న బ్యాగ్ పోయిందని ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఆమెను, బంధువులను తీసుకుని తమ సిబ్బంది కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో సీసీ కెమేరాలను పరిశీలించామని ఆయన తెలిపారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

ద్రాక్షారామ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాబోధనలో ఎటువంటి ఆటంకాలు ఎదురైనా కఠిన చర్యలు తీసుకుంటామని ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ అన్నారు. గురువారం ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో అకృత్యాలు ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. బాలికలకు ఎటువంటి సమస్య ఎదురైనా 100 లేదా 112 నెంబరుకు డయల్ చేయాలని తెలిపారు. జడ్పీ పాఠశాల వద్ద సాయంత్రం 4 గంటలకు పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రత్న పద్మావతి, సైన్సు అధికారి గిరిజాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అరవ విశ్వేశ్వరావు, మెహర్‌సుజాత, తోట నాగమణి, మహిళా పోలీసులు ప్రియాంక, దుర్గ పాల్గొన్నారు.

గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ పుట్టపూడి అన్నారు. గురువారం నిడసనమెట్టలో భూసమస్యలపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. తహశీల్దార్ చిన్నారావు రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నందికోళ్ళ కాశీవిశ్వనాథం, గాధంశెట్టి వీరన్న, వీఆర్‌వో కరీం, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.